అరకొర వసతులతో అగచాట్లు


సీఎస్‌పురంలో అద్దెభవనంలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహం


అంబవరంలో అద్దెభవనంలో ఉన్న బీసీ బాలుర వసతిగృహం

- అద్దె భవనాల్లో సంక్షేమ హాస్టళ్లు
- మరుగుదొడ్లు లేక ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థుల ఇక్కట్లు
- వేధిస్తున్న సిబ్బంది కొరత

సీఎస్‌పురం(పామూరు):

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కరువై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటిలో కొన్ని హాస్టళ్లలో కనీస వసతులైన మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో విద్యార్థులు పడే అగచాట్లు అన్నీ ఇన్నీకావు. పాలకులు పట్టించుకోకపోగా కనీసం మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు సైతం సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల గోడును పట్టించుకోకపోవడం బాధాకరం.

మండల కేంద్రమైన సీఎస్‌పురంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో ఎస్సీ బాలుర వసతిగృహం ఉంది. ఈ హాస్టల్‌ను 28 ఏళ్ల నుంచి అద్దెభవనంలోనే నిర్వహిస్తుండగా ప్రస్తుతం హాస్టల్‌లో 46 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి ఒకే ఒక్క అటాచ్‌డ్ మరుగుదొడ్డి ఉండగా అది కూడా రన్నింగ్ వాటర్‌లేక ఉపయోగించలేని పరిస్థితి. విద్యార్థులు మరుదొడ్లు లేకపోవడంతో డబ్బాలు చేతపట్టుకుని సుదూర ప్రాంతాల్లో చెట్లు వెతుక్కుంటూ వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. అదే విధంగా స్నానాలు సైతం ఆరు బయట తొట్టి వద్దే చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నిసార్లు విద్యార్థులు తమ కష్టాలను పాలకులకు, అధికారులకు చెప్పుకున్నా ఒక్కరూ కూడా కరుణించిన పాపాన పోలేదు.

స్థానిక డీజీపేట రోడ్డులో బీసీ హాస్టల్ ఉండగా అది కూడా సుమారు 23 ఏళ్ల నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ హాస్టల్‌లో 50 మంది వరకు విద్యార్థులు ఉండగా వసతులు మోస్తారుగా ఉన్నాయి. హాస్టల్‌కు కుక్, కామాటి లేరు. వార్డెన్, వాచ్‌మెన్ మాత్రమే ఉండగా వాచ్‌మెన్‌గా ఉన్న వ్యక్తే కుక్‌గా పనిచేయాల్సి వస్తోంది.

మండలంలోని శీలంవారిపల్లెలో బీసీ బాలికల వసతిగృహం ఉండగా ఇది కూడా గత 10 ఏళ్లుగా అద్దె భవనంలోనే ఉంటోంది. ప్రస్తుతం ఈహాస్టల్‌లో 70 మంది విద్యార్థులు ఉండగా హాస్టల్‌కు కామాటి లేరు. వసతులు మోస్తారుగా ఉన్నాయి.


ఎస్సీ హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న ఏకైక అటాచ్డ్ బాంత్‌రూం


సీఎస్‌పురం ఎస్సీ బాలుర వసతిగృహంలో ఆరుబయట స్నానంచేస్తున్న విద్యార్థులు

మండలంలోని అంబవరం గ్రామంలో బీసీ బాలుర వసతిగృహం ఉంది. ఇది 42 సంవత్సరాలుగా ప్రైవేటుదాన్లో ఉండగా ఇది రేకులషెడ్. చల్లాకాలం, వర్షాకాలంలో బాగాఉన్నా వేసవికాలంలో హాస్టల్‌లో విద్యార్థులు వేసవితాపం తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లో 28 మంది విద్యార్థులు ఉండగా దీనికి పామూరు బీసీ హాస్టల్ వార్డెన్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. అదేవిధంగా వాచ్‌మెన్, కామాటి లేకపోగా కుక్ మాత్రమే ఉన్నారు.

ప్రతిపాదనలు పంపాం:
సీఎస్‌పురంలోని ఎస్సీ బాలుర హాస్టల్ సొంతభవనానికి ప్రతిపాదనలు పంపాం. భవనం మంజూరైన వెంటనే నూతన భవనం నిర్మించి విద్యార్థుల కష్టాలు తీర్చుతాం. ప్రస్తుతం తాత్కాలికంగా విద్యార్థుల ఇక్కట్లు తొలగించేందుకు కృషిస్తాం.
శివానాయక్, ఏఎస్‌డబ్ల్యూఓ

వసతులు కల్పించాలి:



హాస్టల్‌లో వసతులు లేవు. వసతులు లేకపోవడంతో విద్యార్థులు చేరేందుకు రాకపోగా సంఖ్యకూడా తక్కువగా ఉంది. ముఖ్యంగా బాత్‌రూమ్స్, మరుగుదొడ్లు లేకపోవడంతో చీకట్లో బహిర్భూకి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మా కష్టాలు తీర్చాలి.
అమన్, ఎస్సీ బాలుర హాస్టల్

వర్షాకాలంలో తీవ్ర ఇక్కట్లు:



వర్షాకాలం సమయంలో బహిర్భూమికి వెళ్లాలన్నా, ఆరుబయట చలిలో స్నానం చేయాలన్నా ఇబ్బందులు పడుతున్నాం. తాత్కాలికంగానైనా మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేసి మా కష్టాలు తీర్చాలి.
వంశీ, ఎస్సీ బాలుర హాస్టల్

మరుగుదొడ్లు లేకపోవడంతో ఇక్కట్లు:



ఎస్సీబాలుర వసతిగృహంలో మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. డబ్బాలు చేతపట్టుకుని హాస్టల్‌కు దూరంగా తోడుగా పోవలివస్తోంది. ఎవరైనా చూస్తే దూషిస్తున్నారు. రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.
ఎం సాయి, ఎస్సీ బాలుర హాస్టల్

ఆరుబైటే స్నానాలు:



హాస్టల్‌లో బాత్‌రూమ్‌లు లేకపోవడంతో హాస్టల్ పక్కన ఉన్న తొట్టిలోని నీటిని బక్కెట్లతో, డబ్బాలతో ముంచుకుని ఆరుబయటే స్నానం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం రన్నింగ్ వాటర్ లేకపోవడం, ఆరుబైట తొట్టిలో నీరు ఉండటంతో ఒక్కోమారు నీరు మరింత చల్లగా ఉండి స్నానాలప్పుడు ఇబ్బందులు పడుతున్నాం.
ఎస్.స్టీఫెన్, ఎస్సీ బాలుర హాస్టల్

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న గంగసాని హుసేన్‌రెడ్డి

పామూరు: వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమీక్షా సమావేశం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కమిటీలకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, కో ఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పాలేటి ప్రేమ్‌కుమార్, ఎంపీటీ నాయబ్‌రసూల్, పావులూరి ఆదినారాయణ, గంధం చిన్న, పెద్దయ్య, కోరె శ్రీనివాసులురెడ్డి, ఎలికా నాగరాజు, రెక్కలసాయి, ఇర్రి వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి


ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ

సింగరాయకొండ: పనిభారం తగ్గించి ఆరోగ్యంగా ఉండేలా సహకరించాలని సచివాలయ కార్యదర్శులు శనివారం ఎంపీడీఓ డి.జయమణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పనిఒత్తిడి పెరిగి అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేల్లో ఏ ఒక్క సిబ్బంది సర్వే సక్రమంగా చేయకపోయినా దానికి పంచాయతీ కార్యదర్శిని శిక్షించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అమలు, ఇంటి పన్ను, నీటి పన్ను, నాన్‌టాక్స్ వసూలు వంటి కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నామని, సర్వే బాధ్యతలు వీఆర్‌ఓ, ఏఎన్‌ఎం, సర్వేయర్లకు అప్పగిస్తే వారు పనిభానంతో చేయలేకపోతున్నామని సర్వేల పట్ల నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని, వీరు చేసే నిర్లక్ష్యానికి పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయటంపై ఆందోళన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


విద్యుత్ ఈఈని సన్మానిస్తున్న 1104 యూనియన్ నాయకులు

కనిగిరిరూరల్: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 1104 యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఈఈ ఆర్ ఉమాకాంత్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 2014 జేఎల్‌ఎం కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, గ్రేడ్ 2 జేఎల్‌ఎంలకు ట్రావెలింగ్ అలవెన్స్ పెయిడ్ హాలిడేస్, కమ్యునికేట్, కంప్లీషన్ కాంట్రాక్ట్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఈఈ ఆర్ ఉమా కాంత్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ అందించడంలో ప్రతి కార్మికుడు నిబద్ధతో పనిచేయాలని కోరారు. అనంతరం 1104 యూనియన్ నాయకులు ఈఈ ఆర్ ఉమాకాంత్‌ను ఘనంగా సన్మానించారు. యూనియన్ డివిజన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ హరికృష్ణా, ఎల్ఎస్ఎస్ అనీల్ కుమార్, నాయకులు మల్లయ్య, జీ కృష్ణా, కుమార్, జీ రమేష్, అనంతరయ్య, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


చింతలపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కొండపి: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి పునర్ వినియోగ వస్తువులు వాడాలని మంత్రి స్వామి అన్నారు. మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్‌లో మంత్రి స్వామి పాల్గొని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల ద్వారా గ్రామాల్లోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నామన్నారు. సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ ను నిషేధిద్దాం ..ప్రాణాలు కాపాడుకుందాం అనే నినాదాన్ని ప్రజలంతా పాటించాలన్నారు. డీపీఓ వెంకటనాయుడు, ప్రత్యేకాధికారి శ్రీనివాస్ ప్రసాద్, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రామాంజనేయులు, మండల అధికారులు పాల్గొన్నారు.

పామూరు: స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఎంఈఓ జి.కరుణకుమారి అన్నారు. మండలంలోని చింతలపాలెంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సర్పంచ్ మెడబలిమి గురవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పారిశుధ్య పనులపై పర్యవేక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి ప్రతిజ్ఞ చేసి అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ గంగిరెడ్డి అరవిందారెడ్డి, యారవ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఏపీఓ బి.మాల్యాద్రి పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: ప్లాస్టిక్ కవర్ల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా కనిగిరి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేల్ జోసఫ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


స్వర్ణాంధ్రస్వచ్ఛ దివస్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి స్వామి

సీఎస్‌పురం(పామూరు): పర్యావరణ పరిరక్షణకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, ప్లేట్లు మొదలైన వాస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఏఓ బి.సంపత్‌కుమార్, ఎంపీపీఎస్ హెచ్‌ఎం మాలకొండయ్య అన్నారు. స్వర్ణభారత్, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని దూరంగా ఉంచాలని కోరుతూ అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రామశారద, పావలి శ్రీనివాసులు, ఎంపీఈఓ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిమూలపు సురేష్‌ను సత్కరించిన పఠాన్ రియాజ్


సురేష్‌ను సత్కరిస్తున్న రియాజ్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన పఠాన్ రియాజ్ స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి తన నియామకానికి సహకరించిన డాక్టర్ సురేష్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సలీం, మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, పాలూరి శ్రీనివాసులరెడ్డి, గొల్లపోతు గోవర్ధన్, పారిశ్రామికవేత్త చింతల వెంకటేశ్వర్లు, షేక్ కరీం, షేక్ ఆబిద్‌ఆలీ, బొప్పర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కనిగిరిరూరల్: పేద విద్యార్థుల్లో విద్యోన్నతికి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక బీసీ వసతి గృహంలో విద్యార్థులకు పరీక్షా సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలు రాయాలన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాదన్నారు. ఎస్సై టి.శ్రీరాం, బీసీ ఐక్యవేదిక నాయకులు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, పల్లా మాలకొండలరావు, దేపూరి వెంకటేశ్వర్లు, చీర్ల నాగా యాదవ్, కూరపాటి ఓబులేసు, శేష బ్రహ్మాచారి, పాట్టీళ్ల మాలకొండయ్య, చింతలపూడి వెంకటేశ్వర్లు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 10వ తరగతి విద్యార్థినులకు శనివారం పరీక్ష ప్యాడ్‌లు ఎస్సై బి.మహేంద్ర పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రమాదేవి, ఎంఇఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోచదువుతున్న 80 మంది విద్యార్థులకు కనిగిరి పట్టణంలోని ఆక్స్ ఫర్డ్ కళాశాల యాజమాన్యం, స్కూల్ హెచ్‌ఎం బొప్పరాజు సుబ్బారావు పరీక్ష సామగ్రి అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం, తులసీ దళార్చన


స్వామివార్లకు పట్టువస్త్రాలు, మహానైవేద్యంతో ప్రదక్షిణలో భక్తులు

పామూరు: స్థానిక రుక్మిణి సత్యభామ సమేత మదన వేణుగోపాలస్వామి తులసీదళ అర్చన, అభిషేకోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం సత్యబాబు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుక్మిణి, సత్యభామ, మదనవేణుగోపాలస్వామి మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం విశిష్ట అలంకరణ చేసి దాతలు సమకూర్చిన పట్టువస్త్రాలను విగ్రహమూర్తులకు అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం మహానైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనవసతి కల్పించారు. పూజా కై ంకర్యాలను ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు పర్యవేక్షించారు. ఉభయదాతలు గుత్తి వెంకటరాజా, బుజ్జమ్మ, అనిల్, యశశ్విని, దివ్య, బండ్లా నారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మంచి ర్యాంకులు సాధించేలా కృషి చేయండి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి, మారిటైమ్ బోర్డు చైర్మన్ సత్య

కొండపి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు కృషి చేయాలని మంత్రి స్వామి అన్నారు. జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో రూ. 1.94 కోట్లతో నిర్మించనున్న బాలికల వసతి గృహానికి మంత్రి స్వామి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ సత్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ కామేపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మంచిర్యాంకులు సాధించాలన్న లక్ష్యంతో పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో 38 వసతి గృహాల్లో వసతుల కల్పనకు రూ.14 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి బాబు, ఎంపీడీఓ రమణమూర్తి, ఇరిగేషన్ డీఈ శ్రీహరి, మండల అధికారులు పాల్గొన్నారు.

ట్రాలీ ఢీ-వ్యక్తి మృతి

ఉలవపాడు: ప్రమాదవశాత్తు ట్రాలీ ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై రాజుపాలెం-చాగల్లు మధ్య శనివారం జరిగింది. అందిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి ట్రాలీ చెన్నైకు వెళ్తున్న సమయంలో రాజుపాలెం దాటిన వెంటనే ట్రాలీకి ఇంజన్‌కు ఉన్న జాయింట్ తెగిపోయింది. దీంతో వెనుక ఉన్న ట్రాలీ రోడ్డు పక్కన వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొట్టింది. ట్రాలి తొక్కేయడంతో శరీరం మొత్తం నుజ్జునుజ్జయింది. గుర్తు పట్టలేని విధంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. వీఆర్‌ఓ రవిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై అంకమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రమైన గ్రామాలకు కృషి చేయాలి


నాగిరెడ్డిపాలెంలో జూట్ సంచులను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సుజాత

పొన్నలూరు: పరిశుభ్రమైన గ్రామాలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ డాక్టర్ పి. సుజాత అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించి పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకుండా చెత్త కుండీలను వినియోగించాలన్నారు. అనంతరం గ్రామ శివారులోని చెత్త దిబ్బలను ప్రొక్లెయిన్‌తో తొలగించి, గ్రామస్తులకు జూట్ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేశ్వరరావు, సర్పంచ్ మమత, కార్యదర్శి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దశదినకర్మలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్


దశదిన కర్మలో డాక్టర్ సురేష్

సింగరాయకొండ: మండలంలోని కలికవాయ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు వీరరాఘవులు దశదినకర్మలో పార్టీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరరాఘవులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు జి.శ్రీహరిరెడ్డి, పాడిబండ్ల నాగేశ్వరరావు, చామల వేణుగోపాలరెడ్డి, నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.280


వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర రూ. 280 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వెంకటకృష్ణ పురం గ్రామానికి చెందిన రైతులు వేలానికి 157 బేళ్లను తీసుకొని రాగా 133 బేళ్లు కొనుగోలు చేసి వివిధ కారణాలతో 24 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.270, సరాసరి ధర రూ.278.77గా నమోదయ్యాయి. వేలంలో 10 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం


స్వామిని పల్లకిపై ఊరేగిస్తున్న దృశ్యం

మర్రిపూడి: పృథులగిరిపై వెలసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం కనులపండువగా సాగింది. అర్చకులు నారాయణం ఆదిశేషాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామి ప్రతిమలను పల్లకిపై ఉంచి ఆలయ ఆవరణలోని మాడవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలవల గురవయ్య, అలవల రాధయ్య, అలవల సుబ్బయ్య, వారి కుమారులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

పాఠశాలకు ప్రింటర్, పరీక్ష సామగ్రి అందజేత


పరీక్ష సామగ్రి అందజేస్తున్న విద్యార్థులు

పీసీపల్లి: మండల పరిధిలోని నేరేడుపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌కు పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.20 వేల విలువైన ప్రింటర్, 30 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అంజినీదేవి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు.

పంచాయతీకి ట్రాక్టర్ బహూకరణ


ట్రాక్టర్ అందజేస్తున్న దేవి సీ ఫుడ్స్ లిమిటెడ్ జీవీఆర్ సత్యనారాయణమూర్తి

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు గ్రామ పంచాయతీకి దేవి సీ ఫుడ్స్ లిమిటెడ్ మూలగుంటపాడు వారు పారిశుధ్య నిర్వహణ నిమిత్తం ట్రాక్టర్, ట్రాలీలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో డీపీఓ గొట్టిపాటి వెంకటనాయుడు, డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్. పద్మ, సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె. రామారావు, దేవి సీ ఫుడ్స్ లిమిటెడ్ జీవీఆర్ సత్యనారాయణమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భూమిపూజ

పీసీపల్లి: మండల పరిధిలోని పొట్టి శ్రీరాములు స్వగ్రామమైన పడమటిపల్లిలో అమరజీవి పొట్టి శ్రీరాములు గుడి నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.